# ఈగ - తేనెటీగ

ఉత్తరాల ద్వారా పరిచయం చేసుకొని ఆప్తులైన యిద్దరు వ్యక్తులు తొలిసారి కలుసుకున్నారు. విశ్వనాథం మద్రాసునుంచి కలకత్తా పనిమీద వెళుతూ విశాఖపట్నంలో నరశింహం యింట్లో ఒకరోజు వుండటానికి ఒప్పుకున్నాడు. వాల్తేరు స్టేషనులో కళ్ళీలాల్చి, కళ్ళద్దాలు, పైన కండువా, గ్లాస్కో పంచ కట్టిన వ్యక్తిని కలుసుకొని-

"మీరేకదూ విశ్వనాథంగారు"అంటే

"ఓహో నరశింహంగారూ" అంటూ ఒకరునొకరు చేతులు కలుపుకున్నారు.

ముఖాలు చూచుకున్నాక యిదివరకు పాతుకుపోయిన ప్రతిబింబాలు యిద్దరి మనసుల్లోనూ చెరగి, నిజమైన ఆకారాలు ప్రతిష్టింపజేసాయ్. నరశింహం, విశ్వనాథం హృదయాన్ని అతని అసంఖ్యాకమైన కథలు, నవలల ద్వారా తెలుసుకున్నాడు. విశ్వనాథంకు నరశింహం విషయంలోవున్న సదభిప్రాయం అతని వుత్తరాల వలనే కలిగింది.

అరోజు సాయంత్రమే నరశింహం యింట్లో యిష్టాగోష్ఠి జరిగింది. విశాఖ పట్నంలోనున్న రచయితలను పదుగురినీ పోగుచేసి విశ్వనాథంగారికి పరిచయంచేస్తూ తమస్నేహం యెలా పెంపొందిందీ నరశింహం యిలా చెప్పుకొచ్చాడు: "ఇప్పుడు విశ్వనాథంగారు పేరుపడ్డ రచయిత కాబట్టి నేను జరిగిన విషయాలు చెప్పటం వలన అతనికి నిరుత్సాహం రాదనుకుంటాను. అతను కొత్తగా కథలు రాస్తున్న రోజుల్లో నేను అతని కథ ఒకటి చదవటం తటస్థించింది. అందులో యెన్నో లోటుపాట్లున్నా ఆ రచయితలో మంచి కథ వ్రాయాలన్న వుబలాటను చూసాను. వెంటనే అటువంటి కథ యీ మధ్య తెలుగు సాహిత్యంలో రాలేదని వ్రాసాను. తిరిగి అతను వుత్తరం వెంటనే వ్రాసారు. "మూడు పత్రికలు త్రిప్పివేసిన కథను మీరైనా అర్థంచేసుకొని ప్రశంసించారు. అవమానాలు భరించలేక భగ్న హృదయునిగా మారబోతున్న నన్ను, మీ వుత్తరం మళ్లీ నా విద్యుక్త ధర్మాన్ని యెరుకపరచింది. మీ వుత్తరం పదేపదే చదివి మున్ముందు ద్విగుణీకృతమైన వుత్సాహంతో వ్రాయటానికి యెంతో సహాయపడ్తోంది" అని వ్రాసారు. తరవాత అతను వ్రాసినకథల్లో క్రొత్తదనం కనిపించింది. బాధలో ఆశను మొలకెత్తించినవాడే అసలైన ఆశావాది. ఆశావాదియైన రచయిత, బయటకు రాటాన్కి నేనేమాత్రం సహాయం చెయ్యగలిగినా మంచిదని అప్పుడప్పుడూ జరగని విషయాలు కూడా వ్రాసేవాడిని. "ఫలానా మీ కథ మా పొరుగాయనభార్య చదివి పూర్తిగా మారిపోయినట్లు చెప్పిందనీ, మా స్నేహితుడు యిలాంటి రచయిత

తెలుగు దేశంలో పుట్టడం మా అదృష్టమని అన్నాడని, మీ ఫలాన కథ మాగురించే తెలుసుకొని వ్రాసాడని ఒక జంట తగువులు మానుకున్నారని యిలా కోరి కల్పించి మెన్నో వ్రాసేవాడ్ని. ఈ అబద్ధాలు అతనికెంతవరకూ పనికొచ్చాయోగాని, నేను మాత్రం అతని రచనలలో నిరాశపోయి అశాకిరణాలను తిలకించాను. జీవితం అన్ని కోణాలనించీ చూసే దృక్పథం అతను అలవరచుకున్నట్లు తోచింది. శిల్పంలో, భాషలో, భావనలలో క్రొత్తదనం కనిపించింది. ఒకే బాణీలో రచనలు పోకండా కొత్త కొత్త పొకడలతో రచనలు సాగేవి. ఒకప్పుడు నేను వ్రాసిన అబద్ధాలు యీనాడు నిజమయ్యాయ్. నిజంగా విశ్వనాథంగారు తెలుగు దేశంలో పుట్టడం మన అదృష్టమని మనమంతా యిప్పుడు చెప్పుకుంటున్నాం. అతని ఆశావాదం వేపు యెందరో యువ రచయితలు మొగ్గు చూపుతున్నారు. అటువంటి రచయితను మీకు పరిచయం చేసే అవకాశం నాకు అతను యిచ్చినందుకు అతనికి కృతజ్ఞుడ్ని."

నరశింహం మాటాడేక కొందరు రచయితలు విశ్వనాథం రచనా వైశిష్ట్యాన్ని గురించి మాటాడారు. సమాధానం చెప్పడానికి విశ్వనాథం లేచాడు. అప్పటికే అతని మనసు కృతజ్ఞతతో నిండిపోయింది.

"అవమానాలు భరించే స్థోమత వుంటేగానీ రచయిత కానేరడనే సత్యాన్ని తెలుసుకోలేని రోజులవి. తిరిగివచ్చిన కథలు నవలలు యెదిగిన కూతుర్లు యింట్లో వున్నట్లుండేవి. నేనొక కథకుడ్ని కాలేనన్న నిరాశ నిస్పృహ నన్ను మ్రింగివేసిన రోజుల్లో నరశింహంగారు వ్రాసిన వుత్తరాలే నన్ను కథలు రాయటానికి ప్రోత్సహించేవి. ఆ వుత్తరాలే రాకపోతే బహుశ: కథకునిగా నా జీవితం యేనాడో అంతమయ్యేది. విడీవిడని పూలపై తేనెటీగలా అతను వ్రాలి మకరందాన్ని గ్రోలారు. ఆ తృప్తితో పూలు విడివడ్డాయ్, నా సాహిత్య సేవకు దోహదమిచ్చింది. తను అబద్ధాలు వ్రాసారని యీరోజువరకూ నాకు తెలీదు. ఇప్పటికైనా తను చెప్పి ఒకసారి నన్ను నేను విమర్శించుకునే అవకాశం యిచ్చినందుకు కృతజ్ఞుడ్ని."

సాహిత్య సభ పూర్తయింది. రాత్రి భోజనాలయ్యాక బయట వాలుకుర్చీలు వేసుకుని యిద్దరూ చాలా రాత్రివరకు వెన్నెల్లో యెన్నో విషయాలు మాటాడుకున్నారు.

మరుచటిరోజు ప్రయాణం. పెట్టె బెడ్డింగు సర్దుకుంటుండగా నరసింహం ఒక చిన్న పుస్తకం యిస్తూ 'వీలైతే చదివి ఒకసారి మీ అభిప్రాయం రాయండి' అన్నాడు.

విశ్వనాథం పుస్తకాన్ని యిటూ అటూచూసి 'ఇదివరకు ఈ పుస్తకం చూసినట్లుంది. ఈ రవి యీ వూరివాడేనా?' అన్నాడు.

'అవును. నా ప్రియమైన స్నేహితుడు. ఒకసారి చదివి మీ అభిప్రాయం తెలియపర్చండి.'

విశ్వనాథం రైలెక్కాడు. ఇద్దరిలో ఆత్మీయత ఏర్పడింది. కలకత్తా నుంచే వుత్తరం వచ్చింది.

"మీరిచ్చిన పుస్తకం రైలులో పూర్తిగా చదివాను. ఇదివరకు నాకు పత్రికలవాళ్లు రివ్యూకిచ్చారు. ఇతను యెందుకు రాస్తున్నాడో తెలీదని, యిక యిలాంటి చెత్తకథలు రాయటం మానమని సలహా కూడా యిచ్చినట్లు జ్ఞాపకం. అప్పుడు కొత్తవాడు యెవడో వ్రాసాడని యిక్కడ ఒక ముక్క అక్కడ ఒక ముక్క చదివి వ్రాసిన

రివ్యూ అది. "విశ్వం" అనే మారు పేరుతో రివ్యూ రాసాను. మీరిచ్చారు కాబట్టి అమూలాగ్రంగా విమర్శనా దృష్టితో యిప్పుడు చదివాను. ప్రతిఒక్క కథా నిజంగా బాగుంది. ఈ రచయిత యింకా గొప్ప కథలు వ్రాయగలడు. గొప్ప భవిష్యత్తు వున్నది. అతని మీద నాకు గౌరవం యేర్పడింది. వీలైతే నేను తిరుగు ప్రయాణంలో అతన్ని వాల్తేరు స్టేషనులో కలుసుకునేట్టు చూడండి."

కలకత్తా నుంచి మద్రాసు పోతున్న విశ్వనాథానికి వాల్తేరు ప్లాటుఫారం మీద మళ్ళీ నరశింహం కలుసుకున్నాడు. మాటల్లో మాటగా-

"రవి వూర్లో లేడా?" అన్నాడు విశ్వనాథం.

నరశింహం విననట్లు వూరకుంటే-

"అతనిని కలుసుకుంటానని ఆశించాను" అన్నాడు.

"అతను వూర్లో లేడు" అన్నాడు నరశింహం.

విశ్వనాథంకు ఆ వారంరోజుల్లోనే నరశింహం దగ్గరనుంచి వుత్తరం వచ్చింది. "రవి అనే పేరుతో కథలు వ్రాసి స్వంతడబ్బుతో సంపుటని అచ్చువేయించినవాడు, ఆ పుస్తకాలు చెల్లక యింట్లో వుంచుకున్నవాడు, "విశ్వం" రాసిన రివ్యూ చదివి, తను కథకుడు యెంతమాత్రం కాలేడని రచయితగా జీవితానికి స్వస్తి చెప్పినవాడు, మరెవడూకారు ఈ నరశింహమే వాడుకలేక పింపిరిపట్టినకత్తికి యిప్పుడు పదునుపెట్టినా తొలివాడి రాదు. ఆలస్యంగా వచ్చిన మీ ఆశీర్వాదం యీ చచ్చిన రచయితను బ్రతికించలేదు. వుంటాను. మీ నరశింహం."

(విశారద, 1964)

(హిందీ అనువాదం: జ్ఞానపీఠ్‌వారి నా కథల సంపుటిలో)

* * *